విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా
శుక్రవారం 3, జనవరి 2025
8 పేజీలు

ఎబి బర్ధన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి

పేదల కోసం నిస్వార్థంగా పనిచేసిన జాతీయ నేత కామ్రేడ్ ఎబి బర్ధన్

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు

విశాలాంధ్ర-తిరుపతి: పేదల కోసం నిస్వార్థంగా పనిచేసిన భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నేత కామ్రేడ్ ఎబి బర్ధన్ ర్ధన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎబి బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో.. కార్మికుల ఉద్యమంలో జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడంతోపాటు.. ఆ మూడింటికి వారధిగా ఉన్న చిట్టచివర నేత ఎబి బర్ధన్ గారిని అన్నారు. వామపక్ష ఉద్యమం చవిచూసిన ఎత్తు పల్లాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి అని, ఆయన పూర్తి పేరు అర్ధేందు భూషణ్ బర్ధన్. ప్రస్తుతం బాంగ్లాదేశ్ లోని ఉన్న సిల్హేట్ లో జన్మించారని, 1940 లో స్వాతంత్ర ఉద్యమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య నేతగా ఆయన రాజకీయ జీవితం ప్రారంభించారని, కమ్యూనిస్టు రాజకీయాలకు ఆకర్షితుడై సిపిఐ లో చేరారని అన్నారు. ఆయన ప్రజా పోరాటాలలో 20 సార్లు పైగా అరెస్ట్ అయ్యారని, నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడపారని, అనంతరం మహారాష్ట్రలో కార్మిక సంఘాల బాధ్యతలను పార్టీ ఆయనకు అప్పగించిందని, అక్కడ కార్మిక నేతగా ఆయన ప్రతిష్ట ఎంతో ఇనుమడించింది అని, ఆ తర్వాత దేశంలో అతి చరిత్ర గలిగిన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని అన్నారు. 1957లో రాజకీయాలలో ప్రవేశించిన బర్ధన్ అదే ఏడాది మహారాష్ట్ర నాగపూర్ శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారని, ఆ తర్వాత ఢిల్లీ రాజకీయాలలో వచ్చిన బర్ధన్ 1996లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని దేశ రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన నాయకుడు ఎబి బర్ధన్ అని తెలిపారు.యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించి ఈ దేశంలో ఉపాధి హామీ పథకాన్ని, అటవీ భూములు కాపాడటంలో సమాచార హక్కు చట్టం తీసుకు రావడంలో, కార్మిక చట్టాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. బర్ధన్ స్ఫూర్తితో నేటి యువత రాజకీయాల్లోకి రావాలని నిస్వార్థంగా పనిచేసి ప్రజా ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్,

2లో

ఈఎస్ఐ ఆసుపత్రి 50 నుండి 100 పడకలకు పెంపు

విశాలాంధ్ర-తిరుపతి: రాయలసీమ జిల్లాల్లోని కార్మికులు, ఈ.ఎస్.ఐ లబ్ధిదారులకు ఉపయోగ కరంగా ఉండి 15 ఏళ్లకు పైగా కల గా వున్న.. తిరుపతి కార్మిక రాజ్య బీమా (ఈ.ఎస్.ఐ) ఆసుపత్రి ని 50పడకల నుండి 100 పడకలకు పెంచుతూ గురువారం రాష్ట్ర కాబినెట్ నిర్ణయం తీసుకోవడంతో తిరుపతి ఆసుపత్రి లో పని చేస్తున్న డాక్టర్లు, నర్సింగ్, పారా మెడికల్, హౌస్ కీపింగ్ సెక్యూరిటీ సిబ్బంది పెద్ద ఎత్తున సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కు, సీఎం చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. 15ఏళ్లుగా పెండింగ్‌లో 100 పడకల పెంపు ప్రతిపధాన కు మంత్రి మండలి.. గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాయల సీమ, నెల్లూరు జిల్లా లోని కార్మికు లకు, లబ్ధిదారులు కు మరిన్ని వైద్య సేవలు, స్పెషలిస్ట్ డాక్టర్స్ సేవలు అందుబాటులో కి వస్తాయని ఆసుపత్రి మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్. ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. తిరుపతి ఆసుపత్రి 100పడకల పెంపు కై విశేష కృషి చేసి, పూర్తి సహాయ, సహకారం అందించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి. సుభాష్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్, రాష్ట్ర డైరెక్టర్ వి. ఆంజినేయులు తో పాటు ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలను సూపరింటెండెంట్ ఎం. శ్యాంబాబు తెలియచేసారు.

సదరంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: సదరం సర్టిఫికేట్ల జారీలో అవకతవకలు జరిగాయనే నేపథ్యంలో ప్రభుత్వం నుండి అందిన మార్గదర్శకాల మేరకు రీవెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని, కొత్తగా ఇచ్చే సదరం సర్టిఫికెట్లలో అక్రమాలకు పాల్పడితే తప్పక సంబంధిత వైద్య అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం సదరం సర్టిఫికేట్ల రీవెరిఫికేషన్ పై, దీర్ఘ కాలిక వ్యాధులతో మంచానికే పరిమితమై 15 వేల రూపాయల పెన్షన్ పొందుతున్న పేషంట్ల వివరాలపై, విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లను పొందుతున్న వాటిపై తనిఖీ మార్గదర్శకాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో, పిడి వెలుగు, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్ తదితర జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సిఎస్ కృష్ణబాబు సంబంధిత కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని కృష్ణ బాబు తెలిపారు. అందులో భాగంగా పరిశీలన చేపడుతున్నామన్నారు. ఇందుకోసం వైద్య బృందాలను నియమిస్తామన్నారు. సధరమ్ ద్వారా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పరిశీలన కొరకు ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ లో వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ట్యాంపరింగ్ వంటి వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్య బృందాలకు సహాయ సహకారాలు అందించడానికి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారించాలని, వారి ఆరోగ్య వివరాలను సంబంధిత వైద్యాధికారులు తక్షణమే యాప్‌లో నమోదు చేయాలన్నారు. సోమవారం నుంచి విచారణ ప్రక్రియ ప్రారంభించాలని, విచారణకు సంబంధించిన మార్గదర్శకాలు పంపుతామన్నారు. 100 శాతం నిక్కచ్చిగా పరిశీలన, విచారణ ప్రక్రియ జరుగుతుందన్నారు. బృందాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ ఎక్కువ సదరం విభిన్న ప్రతిభావంతుల పెన్షన్ల సర్టిఫికెట్లు మంజూరు చేసిన ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని సూచించారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లపై పెన్షన్ పొందుతున్న వారిలో మొదటి దశలో మంచానికే పరిమితం అయిన వారి గృహాలను స్పెషలిస్ట్ డాక్టర్, డిజిటల్ అసిస్టెంట్, పిహెచ్సి వైద్యుల బృందం సందర్శన

2లో

సిపాయి లాల్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి

- అగర్వాల్ కంపెనీ ప్రమాదంలో గాయపడ్డ వారికి రూ.25 లక్షలు చెల్లించాలి
- ఆరోగ్య ఖర్చులను యాజమాన్యమే భరించాలి
- కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి
- ఏఐటీయూసీ డిమాండ్

8లో

ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి) జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బండి చలపతి, ఉదయ్ కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి, ఎన్ శివ, రత్నమ్మ, మంజుల, పద్మా రెడ్డి, రామకృష్ణ, కే వై రాజా, చంద్రశేఖర్ రెడ్డి, కాలయ్య, శ్రీరాములు, సిహెచ్ శివ, శ్రీనివాసులు, అల్లా భాష, విజయ, అలివేలమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) చేసి ప్రభుత్వం నుండి రూపొందించబడిన యాప్ నందు వారి ఆరోగ్య వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందనీ, ఈ నెలాఖరులోపు సదరు మంచానికి పరిమితమైన దీర్ఘ కాలిక రోగాల పేషంట్లకు సంబంధించిన పెన్షన్ల రీ వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. తదుపరి దశలో ఇతర డిజెబిలిటీ పెన్షన్లు పొందుతున్న వారి సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రణాళికలు సిద్ధం చేసి తేదీలు, గ్రామాలు, ఆసుపత్రుల అనుసంధానంతో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. సదరు అంశాల నివేదిక ఏప్రిల్ మాసంలోపు పూర్తిచేసేలా ప్రణాళిక ఉండాలని తెలిపారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ చాలా పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుందని ఎలాంటి అక్రమాలకు చోటు ఉండరాదని, కొత్తగా బోగస్ సదరం సర్టిఫికెట్లు ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పథక సంచాలకులు వెలుగు శోభన్ బాబు, డిప్యూటీ సీఈవో జుబేదా జిల్లా పరిషత్, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: చంద్రగిరి మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా మాజీ చైర్ పర్సన్ చంద్రగిరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ చిత్రాలతో కూడిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి ఓబుల్ రెడ్డి రూపొందించారు. ఈ క్యాలెండర్‌ను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి నుంచి రాష్ట్రంలోని విద్యార్థులు యువత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, మోహన్ రెడ్డి, భూపాల్, రాజశేఖర్ రెడ్డి, రవి, ఓం ప్రకాష్ రెడ్డి, ఓబులేష్, హరినాథ్ రెడ్డి, ముబారక్, మధుసూదన్, రఫీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో అభివృద్ధి ఊసే లేదు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: గత పదేళ్లలో తుమ్మలగుంట పంచాయతీలో అభివృద్ధి ఊసే లేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉందని టీడీపీ నాయకుడు అయ్యప్ప అన్నారు. ఇప్పటివరకు ఉప్పరపల్లి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి లేదని అన్నారు. తుమ్మలగుంటలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా తుమ్మలగుంట పంచాయతీ ఉప్పరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అయ్యప్ప మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తుమ్మల గుంట పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని, ఉప్పరపల్లి గ్రామానికి శ్మశాన వాటిక, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ భవనం లేదని పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఉప్పరపల్లి గ్రామానికి శ్మశాన వాటిక, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ భవనం పై తీర్మానం చేశారు. అనంతరం తుమ్మలగుంట గ్రామస్తులు గ్రామంలో డ్రైనేజీ, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. మఠంలో నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి పన్ను, కరెంట్ మీటరు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు బిరుదాల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో పట్టాలను మార్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-గంగవరం: రీ సర్వే పేరుతో ఆన్లైన్లో భూములను మార్పు చేసిన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని మామడుగు పంచాయతీలో జరుగుతున్న రెవెన్యూ సదస్సు వద్ద ఐఎఫ్టియు ఏఐకె ఎం ఎస్ మరియు పిఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సురేంద్రనాథ్ ఉమాపతి నాయుడు యోగేష్ వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. 2010లో జర్నలిస్టు దీన అను అతనికి ప్రభుత్వం మా మడుగు రెవిన్యూలో 799/5 799/3 సర్వేలో రెండు ఎకరాల 14 సెంట్లు పట్టా ఇచ్చారని ఆన్లైన్ కూడ చేశారనిబ్యాంకు లోను తీసుకోవడం జరిగింది రైతు భరోసా పీఎం కిసాన్ పథకాలలో డబ్బులు కూడా పడుతున్నాయి దీన చనిపోయిన తర్వాత 2015లో భార్య వి ఆర్ జ్యోతి పేరుతో మార్పు చేయడం జరిగింది. ఆన్లైన్ కూడా చేశారు అయితే 2003లో రీ సర్వేలో జ్యోతి పైన ఉన్నటువంటి భూమిని గజ్జల వెంకటప్ప పేరుతో మార్పు చేశారు. ఇది చాలా దారుణమని వారు అన్నారు 15 సంవత్సరాలు క్రితం చనిపోయిన గజ్జల వెంకటప్ప పేరుతో పట్టాను మార్పు చేయడం చాలా దారుణమని రెవెన్యూ అధికారుల అవినీతికి ఇది నిదర్శనమని వారు అభివర్ణించారు తప్పు జరిగిందని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పులు జరగకుండా ఉండాలంటే అధికారుల పైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే జ్యోతి పైన మార్పు చేసి భూమిని సర్వే చేసి స్వాధీనం చేయాలని వారు కోరారు. సమస్య పరిష్కరించమని తాసిల్దార్ దగ్గరికి వెళితే నిర్లక్ష్యంగా జవాబు చెప్పున్నారని ప్రజలతో ఎలా ప్రవర్తించాలో కూడా తాసిల్దార్ కు తెలియడం లేదని వారు ఆరోపించారు. వీఆర్ జ్యోతి మాట్లాడుతూ నా భర్త చనిపోయినాడు అని నాకు ఇద్దరు అమ్మాయిలనిఒకరికి వివాహం అయ్యిందని, ఇంకొక అమ్మాయికి వివాహం చెయ్యాలని భూమి పైన ఆధారపడి ఉన్నానని, రెవిన్యూ అధికారులు ఇలా మార్పు చేయడం వల్ల మా కుటుంబం ఆవేదనకు గురవుతావుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కలెక్టర్ గారు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో కల్పించుకొని నా భూమిని నాకు స్వాధీనం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఇర్షాద్. నాయకులు లక్ష్మి శకుంతల, సరోజ, తిప్పక్క తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర-తిరుపతి: జనవరి 10వ తేదీ వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున తిరుప్పావై సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన, శ్రావణ తిరుమంజనం, శుద్ధి నిర్వహించారు. ఉదయం 6.30 గం.ల నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 9.30 గంటల నుండి దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఏ.పి.శ్రీనివాస దీక్షితులు, ఏఈవో కె.ముని కృష్ణా రెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి భూమిని జ్యోతి పేరుతో మార్పు చేయాలి

విశాలాంధ్ర-గంగవరం: రీ సర్వే పేరుతో ఆన్లైన్లో భూములను మార్పు చేసిన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని వారిని ఉద్యోగాలను తొలగించాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మామడుగు పంచాయితీలో జరుగుతున్న రెవెన్యూ సదస్సు వద్ద ఐఎఫ్టియు ఏఐకె ఎం ఎస్ మరియు పిఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సురేంద్రనాథ్, ఏపి రైతు సంఘం నాయకులు ఉమాపతి నాయుడు, ఐఎఫ్టియు యోగేష్ వెంకట్రామిరెడ్డి లు మాట్లాడుతూ... 2010లో జర్నలిస్టు దీన అను అతనికి ప్రభుత్వం మా మడుగు రెవిన్యూలో 799/5 799/3 సర్వేలో రెండు ఎకరాల 14 సెంట్లు పట్టా ఇచ్చారని ఆన్లైన్ కూడ చేశారని బ్యాంకు లోను తీసుకోవడం జరిగిందన్నారు. రైతు భరోసా పీఎం కిసాన్ పథకాలలో డబ్బులు కూడా పడుతున్నాయి దీన చనిపోయిన తర్వాత 2015లో భార్య వి ఆర్ జ్యోతి పేరుతో మార్పు చేయడం జరిగింది ఆన్లైన్ కూడా చేశారు అయితే 2003లో రీ సర్వే చేసినట్లు జ్యోతి పైన ఉన్నటువంటి భూమిని గజ్జల వెంకటప్ప పేరుతో మార్పు చేశారు ఇది చాలా దారుణమన్నారు. 15 సంవత్సరాలు క్రితం చనిపోయిన గజ్జల వెంకటప్ప పేరుతో పట్టాను మార్పు చేయడం చాలా దారుణమని రెవెన్యూ అధికారుల అవినీతికి ఇది నిదర్శనమని వారు అభివర్ణించారు తప్పు జరిగిందని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటి తప్పులు జరగకుండా ఉండాలంటే అధికారుల పైన సీరియస్ గా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వీఆర్ జ్యోతి మాట్లాడుతూ.... నా భర్త చనిపోయినాడు అని నాకు ఇద్దరు అమ్మాయిలని ఒకరికి వివాహం అయ్యిందని, ఇంకొక అమ్మాయికి వివాహం చెయ్యాలని భూమి పైన ఆధారపడి ఉన్నానని, రెవిన్యూ అధికారులు ఇలా మార్పు చేయడం వల్ల మా కుటుంబం ఆవేదనకు గురవుతున్నదని వాపోయారు. బ్యాంకు లోను రెన్యువల్ చేయడానికి బ్యాంకుకు వెళితే నీ పేరు పైన లేదని బ్యాంకు వారు చెప్పడం జరిగిందని రెన్యువల్ చేయకపోవడం వల్ల వడ్డీ పెరుగుతావుందని పై అధికారులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో కల్పించుకొని నా భూమిని నాకు స్వాధీనం చేయాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఇర్షాద్. నాయకులు లక్ష్మి .శకుంతల. సరోజ. తిప్పక్క తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి పరామర్శ

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండలంలోని ఎట్టేరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి గత కొద్ది రోజులుగా అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కృపా లక్ష్మి గ్రామానికి చేరుకొని జనార్దన్ రెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సింగల్ విండో అధ్యక్షులు వేల్కూరు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, రూప్ శేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కోదండ రెడ్డి, రఘుపతి రెడ్డి, వేల్కొరుకుట్టి, కిషోర్ రెడ్డి, ఢిల్లీ, జగదీష్, గోపి, విష్ణు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వరదరాజుల రెడ్డి (పెద్దిరెడ్డి) కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి గురువారం పరామర్శించారు. మండలంలోని వేపంజేరి పంచాయతీ మాజీ సర్పంచ్ వరదరాజులు రెడ్డి(పెద్దిరెడ్డి) తండ్రి చిన్నబ్బారెడ్డి (110) వృద్ధాప్య కారణంగా బుధవారం మృతి చెందడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి కుటుంబాన్ని ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు వేల్కూరు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, అంబోదరపల్లి బాబు రెడ్డి, రూప్ శేఖర్ రెడ్డి, బూత్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, వేల్కొరుకుట్టి, కిషోర్ రెడ్డి, ఢిల్లీ, జగదీష్, కాలేపల్లి మణి, గోపి, విష్ణు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, CHEEMALA DIVIJA (Old Name) wife of SUNIL KUMAR MALLELA, Resident of Flat. No.406, 4 th Floor,Kota Elsons Towera, Kennady Nagar, Tirupati Urban Mandal, Tirupati Dt.,A.P. is hereby declared that I have changed my surname as **DIVIJA MALLELA** **(New Name)** hereafter call all purpose in future.

నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా నగిరి పురపాలక సంఘం సత్రవాడలో దేశ పిల్లయార్ గుడి కలదు. ఈ దేవాలయాన్ని దేవాలయ శాఖ నందు సెక్షన్ 43 కింద రిజిస్టర్ చేయదలచినాము. ఇందుకు సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉన్నయెడల సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, చిత్తూరు వారి కార్యాలయము నందు 15 రోజుల లోపు తెలియజేయగలరు.

ఆలయ కమిటీ,
నగిరి పురపాలక సంఘం,
సత్రవాడ దేశ పిల్లయార్ గుడి ఆలయ కమిటీ

పోరాటాలు త్యాగాలతో పునీతమైనదే సిపిఐ చరిత్ర

విశాలాంధ్ర-పిచ్చాటూరు: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజక వర్గం పిచ్చాటూరు మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత వార్షికోత్సవంలో భాగంగా జెండా ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజక వర్గం కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ మాట్లాడుతు సిపిఐ పార్టీ భారతదేశంలో1925 డిసెంబర్ నెల 26వ తేదీన కాన్పూర్‌లో పార్టీని స్థాపించడం జరిగిందని నాటి నుండి నేటి వరకు ప్రజా శ్రేయస్సు కొరకు పోరాటాలు త్యాగాలతో పునితమైందని తెలంగాణలో నైజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాటంలో 4,000 మంది ప్రాణాలు అర్పించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందని దున్నే వాడికి భూమి కావాలని సంపాదన సృష్టించే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు చట్టాలను సాధించడంలో క్రియాశీలింగ పోరాడింది సిపిఐ పార్టీ అని సంపూర్ణ స్వాతంత్రం ఇవ్వాలని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడింది దేశ సమైక్యతను సమగ్రతను కుల మతాలకతీతం గా లౌకిక రాజ్యం ఉండాలని. అక్రమ కేసులు నిర్బంధాలు తలవంచని చరిత్ర కమ్యూనిస్టులు దేనిని చిన్ని రాజ్ అన్నారు ప్రజా దోపిడి ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని ప్రపంచంలో అన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీ ఉందని భారతదేశ రాజకీయ చరిత్రలో సువర్ణ అక్షరాలతో రాయి తగిన దని ప్రజలకు రైతులకు కార్మికులకు ఉద్యోగస్తుల హక్కులు కాపాడటంలో ముందుండి పోరాడుతుందని రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాడాలని అందుకు ప్రజలు సహకారం అందించాలని చిన్ని రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుభాష్, అన్నా దొరై పెద్ద గోవిందయ్య ఏఐటీయూసీ నాయకులు శరవన్ అయ్యప్ప పాల్గొన్నారు.

భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర -పాకాల: భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల కార్యక్రమం ఏర్పాటు చేసిందని పాకాల ఇన్చార్జి తహసిల్దార్ సంతోష్ సాయి తెలిపారు. పాకాల మండలంలోని అచ్చమ్మ అగ్రహారం లో ఇంచార్జ్ తహసిల్దార్ సంతోష్ సాయి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని ఈ సదస్సులను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలకు సంబంధించిన 32 అర్జీలు వచ్చాయి. ఇందులో హౌసింగ్ కు సంబంధించిన అర్జీలు 2, భూ సర్వే కి సంబంధించిన అర్జీలు 8, మ్యూటేషన్ కరెక్షన్ కు సంబంధించి రెండు, మ్యూటేషన్ కు సంబంధించి ఎనిమిది సర్వేనెంబర్ చేర్పులకు సంబంధించి ఏడు, నోషనల్ కథకు సంబంధించిన ఐదు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తాసిల్దార్ కళ్యాణ్, సర్పంచ్ చెంగల్రాయులు, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సావిత్రి ప్రభాకర్. మండల సర్వేయర్ వాసుదేవ్, గ్రామ రెవెన్యూ అధికారిణి లక్ష్మి, గ్రామ సర్వేయర్ శైలజ గ్రామస్తులు జ్యోతి నాయుడు, లక్ష్మీపతి, చంద్రయ్య నాయుడు, రఘునాథ నాయుడు, సోము, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టానికి తూట్లు

19 ఏళ్ళు గడిచినా పట్టించుకోని వైనం సెక్షన్ 4(1)(బి) ఏంటో ఎరుకలే...!

మున్సిపల్ కమిషనర్ పై సహ కమిషన్ కు ఫిర్యాదు

విశాలాంధ్ర-పలమనేరు: సహచట్టం అమలు ప్రకారం సమాచారం అడిగిన 120 రోజులలోపు ప్రతి సంస్థ తయారు చేసుకోవాలి... ప్రజలకు అందుబాటులో ఉంచాలి... స్వచ్ఛందంగా అందించాలి...అన్న సమాచార హక్కు చట్టం నిర్దేశాన్ని పలమనేరు మునిసిపల్ కమిషనర్ ఉల్లంఘించారు. అడుగడుగునా చట్టానికి తూట్లు పొడిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు మునిసిపాలిటీకి సంబంధించి 4 అంశాల సమాచారం సమాచార హక్కు చట్టం ద్వారా కోరడం జరిగింది.అయితే అధికారి అసంపూర్తి సమాచారంతో చేతులు దులుపుకున్నారు. మొదటి అప్పీలు చేశారు. పౌర సమాచార అధికారిపై చర్యలు తీసుకుని పూర్తి సమాచారం అందజేయాలని వికోట మండలం కుమ్మరమడుగు వాసిపల్లగిరి బాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ....అధికారుల్లో ఇంకా మార్పు రాలేదని యథావిధిగా అసంపూర్తి సమాచారంతో దరఖాస్తుదారున్ని తప్పుదోవ పట్టిస్తున్నారని వాపోయారు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) సమాచారాన్ని ప్రతి ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు స్వచ్ఛందంగా అందించాలన్నారు. కార్యాలయానికి సంబంధించిన విధులు, బాధ్యతలు ఉద్యోగులు, విధులు, ఉద్యోగుల జాబితా, నెలవారి వేతనాలు,ఇతర సౌకర్యాలు, రాయితీలు, అనుమతులు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, నిబంధనలు అమలులో పాటించే మార్గదర్శకాలు, బడ్జెట్లు తదితర 17 అంశాల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అయితే ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజా సమాచార అధికారి వివరాలు తప్ప ఎటువంటి సమాచారం పంపలేదు. చట్ట అమల్లోకొచ్చి 19 ఏళ్లు గడిచిన అధికారి చట్టానికి విరుద్ధంగా నడుచుకోవడంపై గిరిబాబు మండిపడ్డాడు. చట్టం పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్కు అప్పీలు దాఖలు చేయడం జరిగిందన్నారు పారదర్శకత, జవాబుదారీ తనమే లక్ష్యంగా తీసుకొచ్చిన చట్టానికి కమిషనర్ విరుద్ధంగా నడుచుకోవడంపై పలువురు సహ ఉద్యమకారులు మండిపడుతున్నారు.చట్టం పట్ల అవిధేయత చూపుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బాలకృష్ణాపురం మడుగు వద్ద వంతెనను నిర్మించండి

రెవెన్యూ సదస్సులో గ్రామ సర్పంచ్ ఇందుమతి వినతి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం బాలకృష్ణాపురం మడుగు వద్ద వంతెనను నిర్మించాలని గ్రామ సర్పంచ్ ఇందుమతి అధికారులకు విన్నవించారు. గురువారం బాలకృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తహసిల్దారు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇంచార్జ్ ఆర్ఐ సురేష పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ నేపథ్యంలో పలు సమస్యలపై ప్రజల నుంచి అధికారుల బృందం వినతులను స్వీకరించింది. వర్షాలు పడ్డప్పుడు బాలకృష్ణాపురం మడుగు వద్ద నీటి ప్రవాహ వేగం అధికంగా ఉంటుందని గ్రామ సర్పంచ్ ఇందుమతి విన్నవించారు. ఈ క్రమంలో మడుగును దాటి రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ వంతెనను నిర్మించి రైతుల కష్టాలను తొలగించాలని ఇదివరకే ఎన్నో పర్యాయాలు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోయింది అన్నారు. అందువల్ల రెవెన్యూ సదస్సులోనైనా వంతెనను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులకు వినతి సమర్పించారు. అలాగే భాదర్ వేడు మడుగు వద్ద కూడా వంతెనను నిర్మించాల్సి ఉందన్నారు. బాలకృష్ణాపురం ఆంధ్ర, తమిళనాడు సరిహద్దున చెక్ డాం నిర్మించి సాగునీరు వృధాగా పోకుండా అడ్డుకట్ట వేయాలని సర్పంచ్ ఇందుమతి విన్నవించారు. అలాగే స్మశానానికి సిమెంట్ రోడ్డు నిర్మించి మృత దేహాలను తీసుకెళ్లడానికి గ్రామ వాసులకు సౌకర్యం కల్పించాలన్నారు. సర్వే నెంబరు 113 ఏ,115/1 ఏలోని ఒక ఎకరా 17 సెంట్లు భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని రైతు రమేష్ వినతి సమర్పించారు. తమకు పక్కా గృహం మంజూరు చేయాలని బాలకృష్ణాపురం మహిళ పునీత విన్నవించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మోహన్ రాజ్, పంచాయతీ సెక్రెటరీ సునీల్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందీప్, వెల్ఫేర్ అసిస్టెంట్ నితిన్, డిజిటల్ అసిస్టెంట్ మణికంఠ, సర్వేయర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-పిచ్చాటూరు: మండలంలో పులిగుండ్రం సచివాలయం నందు తహసీల్దార్ రమేశ్ బాబు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతోందన్నారు. రెవెన్యూపరమైన అంశాలు, భూములు వివాదాల విషయంలో త్వరితగతిన స్పందించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. రెవిన్యూ సదస్సులో పెట్టుకున్న ప్రతి అర్జీ ఉచితంగా ప్రభుత్వం అందిస్తుదన్నారు. రైతులు రెవిన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కారం చేసుకోవలన్నారు. ప్రభుత్వ భూములు పరిరక్షించాలని రైతులు సమావేశంలో ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు.దీంతో వారు ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం చేసుకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులు కు సూచించారు. రెవిన్యూ సమస్యలు పలువురు రైతులు అర్జీలు అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, వీఆర్వో ఇళయరాజా, సర్వేయర్ సునీత, సర్పంచ్ దిలీప్, ఎంపీటీసీ రమేష్ రాజు, మాజీ మండల టిడిపి అధ్యక్షులు రామచంద్ర రాజు, సర్పంచ్ పద్దు రాజు, రవి, అటెండర్ సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు

ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధ్యం

విశాలాంధ్ర-చంద్రగిరి: ఆధునిక సాంకేతిక పద్దతులు పాటించి మామిడి పంటలో అధిక దిగుబడి సాధ్యం అని తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి.దశరధరామిరెడ్డి తెలిపారు. మామిడిలో పూత దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు గురించి ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో భీమవరంలో గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి. దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని మామిడి తోటలు పూత మొగ్గ దశ, పచ్చిపూత దశలో ఉన్నాయని, మిగిలిన తోటలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి కనుక రైతులు తోట ఎటువంటి దశలో ఉన్నదో గమనించి సరైన పురుగు మరియు తెగులు మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. రంగంపేట, కందులవారి పల్లి, చిన్నారామాపురం గ్రామాలలోని రైతులు కలిసి ఒక రైతు సంఘాన్ని స్థాపించడం వలన రైతు సంఘానికి ఎటువంటి సదుపాయాలు ప్రభుత్వం నుండి చేకూరుతాయి, ఏవిధంగా రైతే నేరుగా తమ పంటను ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు మరియు ఏ విధంగా రైతు సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించవచ్చని రైతులకు సూచనలు ఇచ్చారు. చీని, నిమ్మ పరిశోధనా కేంద్రం పేరూరు నుండి కీటక శాస్త్రవేత్త రంజిత్ మాట్లాడుతూ గత సంవత్సరంలో డిసెంబర్ మాసంలో పడిన వర్షాల కారణంగా ప్రస్తుతం వచ్చే పూతలో రసం పీల్చే పురుగుల మరియు తెగుళ్ళ ఉధృతి అధికం అయ్యే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. పూత ఇంత వరకూ గమనించని తోటలలో 13:0:45 (మల్టీ కె) 10 గ్రా. మరియు ఫార్ములా 4 అనే సూక్ష్మ ధాతు మూలకాల మిశ్రమం 3 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన పూత అంతా ఒకేసారి వచ్చే అవకాశం ఉంటుందని, పూత మొగ్గ దశలో ఉన్న వారు క్లోరోపైరిఫాస్ 50 శాతం 2 మి.లీ., కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా., బోరాన్ 2 గ్రా మరియు గమ్ 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి చెట్టు కాండము, లోపలి మరియు బయట కొమ్మలంతా మంచులా పడే విధంగా మందును పిచికారి చేయాలని, పూత పచ్చి పూత దశలో ఉన్నట్లయితే ఇబ్రోఫెజినం ఏసిఫేట్ కాంబినేషన్ లో లభించే పురుగు మందు 1 గ్రా., లేదా డైనెటోఫురాన్ 0.6 గ్రా., బూడిద తెగులు నివారణకు హెక్సకోనజోల్ 2 మి.లీ లేదా మైక్లోబుటానిల్ 1 గ్రా. మరియు గమ్ 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచనలు ఇచ్చారు. వర్షాల కారణంగా తోటలలో కలుపు ఎక్కువగా ఉంటుంది కనుక ఒకసారి తేలిక పాటి దున్నకం చేసుకోవాలని చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకూరాలు సుహాసిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీవారిమెట్టు సమీపంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలు టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్‌ల మార్గనిర్దేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ కుమార్ టీమ్ బుధవారం చంద్రగిరి మండలం, భాకరాపేట రేంజిలోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. వీరు శ్రీవారిమెట్టుకు పడమర వైపుకు చేరుకునే సరికి ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టే సరికి ఒక వ్యక్తి దుంగను పడేసి పారిపోగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేశారు. అక్కడ మూడు దుంగలను సేకరించి, అరెస్టు చేసిన ఇద్దరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయగా, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో మరికొంత మంది స్మగ్లర్లు నిషేధిత అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలియడంతో వారికోసం టాస్క్ ఫోర్సు సిబ్బంది గాలింపు చేపట్టారు.

రైలు దిగుతూ ఇరుక్కుపోయి సత్యవేడు వాసి మృతి

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణం ఆర్టీసీ గ్యారేజ్ రోడ్లో నివసిస్తున్న మాణిక్యం శెట్టి (ఎర్ర శెట్టి) కుమారుడు బాలాజీ(40) రైలు నుంచి కిందకు దిగుతూ ఇరుక్కుపోవడంతో మృతి చెందారు.ఈ రైలు ప్రమాదం తమిళనాడు కవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. తమ కుమార్తె చదువుల కోసం బాలాజీ విజయవాడకు వెళ్లారు.పనులు పూర్తి చేసుకొని విజయవాడలో బుధవారం రాత్రి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు.ఈ నేపథ్యంలో కవర్ పేట వద్ద రైలు వేగం తగ్గడంతో బాలాజీ ప్లాట్ ఫామ్ పైకి దిగుతుండగా కిందకు కాలు జారడంతో కదులుతున్న రైలుకు ఇరుక్కుపోయి అక్కడికక్కడే బాలాజీ మృతి చెందారు.మృతి చెందిన బాలాజీకి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్టు బంధువులు చెప్తున్నారు.కాగా సత్యవేడు పట్టణం గాంధీ విగ్రహం ఎదురుగా మృతి చెందిన బాలాజీ స్టోర్ నడుపుతున్నారు. ఈ రైలు ప్రమాదంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ

విశాలాంధ్ర -పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం పిచ్చాటూరు టీచర్స్ కాలనీ జాతీయ రహదారి వద్ద గురువారం సాయంత్రం ఎస్సై వెంకటేష్ బృందం వాహనాలను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, హాన్స్,గుట్కా మొదలైన మత్తు పదార్థాల మాదక ద్రవ్యాలు ఎక్కువగా పట్టుబడటం యువకులు వీటికి బానిస కావడం జరుగుతూ ఉంది ఇలాంటి వాటిని అరికట్టడానికి, అక్రమంగా రవాణా చేయడం అమ్మకం చేయడం ఉండకూడదని పట్టుపడితే కఠిన చర్యలు ఉంటాయని, యువకులు మంచి పద్ధతిలో మంచి భవిష్యత్తు ఉండాలని ఇలాంటివి తరచూ తనిఖీ చేస్తూ ఉంటామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్లు మరియు సిబ్బందులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మేట్ ను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు పాలిటెక్నిక్ కాలేజ్ ఇండియాలోని మైనింగ్ కాలేజీల్లో గుర్తింపు పొందడం సంతోషంగా ఉందని గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ కాలేజీకి వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని కొత్త రోడ్డు వేయించామని గుర్తు చేశారు. పురుషులకు దీటుగా మహిళలు కూడా క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, మహిళా అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అనంతరం జరిగిన రన్నింగ్ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ కుమార్ ప్రియా, రవికృష్ణ, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, వెంకటేష్, ముమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒక్కరు మృతి

విశాలాంధ్ర-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వెనక భాగంలో 103.30×104.2 పోస్టల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మగ వ్యక్తి ప్రమాదశాత్తు రైలు నుండి జారి రైలు క్రింద పడి చనిపోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు గడ్డం పెంచుకుని, పింక్ కలర్ ప్లెయిన్ షర్ట్, తెలుపు రంగు కాటన్ జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రైల్వే ఎస్ఐ చెన్నకేశవలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా పై తెలిపిన ఆధారాలు తెలిసినవారు 9440904877, 9573245266 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని ఏటువాకిలి పంచాయతీ పరిధిలో రెవెన్యూ సదస్సును మండల తహసీల్దారు రాము అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మోపూరి మోహన్ రెడ్డి పాల్గొని రైతుల నుండి సుమారు 25 భూ సమస్యల అర్జీలను స్వీకరించడం జరిగింది. వచ్చిన అర్జీలు అన్నిటికీ పరిష్కారం చేస్తామని రైతన్నలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నల భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతులు భూ సమస్యలతో ఆఫీసుల చుట్టూ తిరగకుండా వారి గ్రామంలోనే సమస్య పరిష్కారం అయ్యే విధంగా ఈ సదస్సు ఏర్పాటు చేశారన్నారు. అంతే గాకుండా రేపటి నుండి మూడు రోజులు పాటు పంచాయతీ పరిధిలో రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ రాము తెలియజేయడం జరిగిందన్నారు. కావున రైతులంతా తమ రికార్డులతో రేపు రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉండాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద్ శ్రీనివాసులు రెడ్డెప్ప కృష్ణప్ప శేషు సర్వేయర్ శ్రీనివాసులు వీఆర్వో వేణు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికల అవసరం: ఎంపీడీవో

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: పంచాయతీ అభివృద్ధి కొరకు పక్కా ప్రణాళికతో అభివృద్ధి సాధించుకోవాలని ఎంపీడీవో త్రివిక్రమ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ భవనం ఎదుట గురువారం గ్రామపంచాయతీ సభ సర్పంచ్ బూదురు వెంకటమ్మ, ఉపసర్పంచ్ కెఎం రాజాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి తొన్నాటి సుబ్రహ్మణ్యం నిర్వహించారు, గ్రామ సభలో జరిగిన పనులపై నివేదిక చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. గ్రామాభివృద్ధికి కావలసిన ప్రణాళికలను అవసరాలను గుర్తించి వాటి లక్ష్యాలను సాధించుటకు ప్రణాళిక రూపకల్పన జరిగింది. అనంతరం ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ప్రస్తుతం మనకు ఉన్న పథకాలు గ్రామ ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అందుకు తగ్గ ప్రణాళిక వేసుకొని గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని చెప్పారు.గ్రామాల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు,గ్రామాల అభివృద్ధి కోసమే టీడీపీ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సభలు నిర్వహి స్తోందని, గ్రామాలను అన్నీ రంగాలలో ముందుకు నడిపించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే గ్రామసభలో గ్రామ అభివృద్ధి లక్ష్యాలను సాధించుటకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడతామన్నారు. కంచన పుత్తూరు గ్రామపంచాయతీ సభ సర్పంచ్ బట్ట స్వప్న యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు, అభివృద్ధి ప్రణాళిక, చేసిన పనులు, చేయవలసిన నివేదికలు తయారుచేసి అభివృద్ధి ప్రణాళిక చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసిల పాత్ర కీలకం

ఎంఐఓ యం.శంకరయ్య

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు హై స్కూల్ నందు 1 రోజు ఎస్ఎంసి శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాలకి ఇద్దరు చొప్పున మండలంలో ఉన్న ఎస్ఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా మించల శంకరయ్య వ్యవహరించగా, అబ్జర్వర్‌గా కే.శ్రీనివాసులు వ్యవహరించారు. అలాగే ఓ భాస్కర్, మల్లికార్జునరావు మరియు చెంచు రాజాలు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహణ బాధ్యతలు, బాలల హక్కుల సంరక్షణ, పాఠశాల సంరక్షణ పర్యావరణం అంశాలలో బాధ్యతాయుతంగా ఎస్ఎంసి సభ్యులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలను అభివృద్ధి పదంలో నడిపించాలని ఎం.శంకరయ్య సూచించడం జరిగినది. అదేవిధంగా ఇలాంటి శిక్షణను పాఠశాల స్థాయిలో కూడా జరిపి తల్లిదండ్రులను కమిటీ సభ్యులను మరియు ప్రధాన ఉపాధ్యాయ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని కూడా ఆయన సూచించడం జరిగింది. అలాగే అబ్జర్వర్‌గా విచ్చేసిన శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యము ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కలిసికట్టుగా పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు పాఠశాల నిర్వాహణ బాధ్యతల గురించి, బాలల హక్కుల గురించి ఓ.భాస్కరయ్య తెలుపుగా, పాఠశాల సంరక్షణ పర్యావరణం గురించి విపులంగా చెంచు రాజా తెలిపారు. అలాగే పాఠశాల ఇతర సమస్యలు పరిష్కారాలు సామాజిక తనిఖీ తదితర అంశాలకి సంబంధించి మల్లికార్జున వివరించడం జరిగినది. మంచి వాతావరణంలో, టెక్నాలజీని అనుసంధానం చేస్తూ చాలా చక్కగా కార్యక్రమం జరిగిందని ఎస్ఎంసి సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన గవర్నమెంట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు వారి సిబ్బందికి అలాగే సిఆర్పి లకు అదేవిధంగా ఎమ్మార్సీ సిబ్బందికి కోర్స్ డైరెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు:డిఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మద్యం తాగి వాహనాలు నడపకూడదని శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహామూర్తి హెచ్చరించారు. నూతన ఏడాది వేడుకలు పురస్కరించుకుని గత నెల 31వ తేదీన మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి 1వ, 2వ పట్టణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ మీద ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 35మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వీరి వాహనాలను సీజ్ చేశారు. అనంతరం వీరందరినీ గురువారం 1వ పట్టణ పోలీసు స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీయస్పీ నరసింహామూర్తి మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వలన జరిగే నష్టాలు... అందుకు చట్టపరంగా తీసుకునే చర్యలు గురించి వారికి ఆయన వివరించారు. మరోసారి మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీయస్పీ నరసింహామూర్తి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సీఐ డి.గోపి, రెండవ పట్టణ సీఐ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళకు బృందమ్మ నివాళులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి షాకీరాలీ అత్త తెహరాబీకి గురువారం బొజ్జల బృందమ్మ నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కైకాలవీధిలో తెహరాబీ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బొజ్జల బృందమ్మ అక్కడకు వచ్చి తెహరాబీకి నివాళులు అర్పించారు. తెహరాబీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కోరుకున్నారు. వారి కుటుంబ సభ్యుల్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో షాకీరాలీ, సీఎస్ మస్తాన్, షఫీ, ఖాదర్ బాషా, జిలానీ భాషా, అస్మత్, కరీం,జావిద్, మీర్జా, నయీమ్, అల్లా బకాష్, జాకీర్ పాల్గొన్నారు.

జిల్లాలో మార్కెట్ కమిటీల చైర్మన్ రిజర్వేషన్లు ఖరారు

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలో మార్కెట్ కమిటీల పాలకవర్గాల చైర్మన్ పదవులకు రిజర్వేషన్ రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. మార్కెట్ కమిటీ లో కూడా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి మార్కెట్ కమిటీల పాలకవర్గాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలోనే ఏడు మార్కెట్ కమిటీల పాలకవర్గాల రిజర్వేషన్లను జిల్లా అధికార యంతరంగం ఖరారు చేసింది. జిల్లాలోని చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బిసి జనరల్ కు, పెనుమూరు మార్కెట్ కమిటీ బీసీ జనరల్ కు, సోమల ఎస్సీ మహిళకు, రొంపిచర్ల ఓసి జనరల్, పలమనేరు బీసీ మహిళ, పెనుమూరు ఓసి జనరల్, ఎస్ఆర్ పురం ఎస్సీ జనరల్, బంగారుపాలెం ఓసి జనరల్, నగిరి ఓసి మహిళ, కుప్పం బీసీ మహిళలకు కేటాయించారు. పాలకవర్గ సభ్యుల్లో కూడా రిజర్వేషన్లు నిర్ణయించారు.

పాఠశాలల చైర్మన్‌లకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-చౌడేపల్లి : గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌడేపల్లి ఆవరణ ములో ఇటీవల నూతనంగా ఎంపిక కాబడిన మండలం లోని అన్ని పాఠశాలల కమిటీ చైర్మన్ లకు మరియు వైస్ చైర్మన్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా తిరుమలమ్మ మరియు కేశవ రెడ్డి ఎంఈఓ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రతి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ముఖ్యంగా మిడ్ డే మిల్స్ పర్యవేక్షణ బాత్రూములు మరియు స్కూల్ ఆవరణములు శు భ్రముగా స్కావెంజర్స్ ద్వారా చేయించే బాధ్యత స్కూల్ కమిటీ దేనిని తెలియజేశారు బడి మానేసిన విద్యార్థులను తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించి విధిగా స్కూల్లో చేర్పించాలని తెలియజేశారు పాఠశాలల్లో జరిగే ప్రతి మీటింగ్ కు హాజరుకావాలని ప్రతి ఒక్క కార్యక్రమానికి హాజరై విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలియ జేశారు ఈ కార్యక్రమంలో మండలంలోని కమిటీ చైర్మన్‌లు వైస్ చైర్మన్లు ప్రధానోపా ధ్యాయులు పి నాగరాజు రెడ్డి పద్మజ అశ్వత్ నారాయణ ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మినీ గోకులం పూజా కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర - తిరుపతి: ఏ.రంగంపేట పంచాయతి నందలి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 103 మినీ గోకులం నిర్మాణం కొరకు పూజా కార్యక్రమమము నిర్వహించబడుతుందని. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ పులివర్తి వెంకటమణి ప్రసాద్ (పులివర్తి నాని) ముఖ్య అతిధిగా పాల్గొననున్నారని ఎంపిడిఓ శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదరు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 103 మినీ గోకులం నిర్మాణం పూజా కార్యక్ర మానికి మండలములోని మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, అందరు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి/గ్రామ స్థాయి అధికారులు అందరూ తప్పక హాజరై సదరు కార్యక్రమాన్ని విజయవంతము చేయవలసినదిగా ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్

నూతన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : గ్రామీణ బ్యాంక్ నూతన ప్రధాన కార్యాలయమును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివ్ భజరంగ్ సింగ్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మర్ ఎ ఎస్ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా అభివృద్ధికి మా బ్యాంక్ ఎక్కువ కృషి చేసేలా పనిచేస్తామని, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయమునకు స్వంత భవనం దాదాపు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్థులతో నిర్మించామని, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నకు ఇదివరకు స్వంత భవనం లేదని, సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆకాంక్షల మేరకు కొత్తగా భవనం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని, జిల్లా అభివృద్ధిలో భాగంగా 100 బ్రాంచ్ ల పైన పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఖాతాదారులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాను. ఈ కార్యక్రమములో ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజ ర్ చంద్రశేఖరన్, జనరల్ మేనేజర్ ప్రభాకరన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ ఇతర బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి మద్దతుగా ఎన్విఆర్ ట్రస్ట్

విశాలాంధ్ర-పుంగనూరు: ఈ నెల 5వ తేదీ అనగా ఆదివారం విజయవాడలో జరుగు హైందవ శంఖారావానికి మద్దతుగా ఎన్విఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నియోజకవర్గ జనసేన నాయకులు వేణుగోపాల్ రెడ్డి తనవంతు సహాయం అందించారు. పుంగనూరు నియోజకవర్గంలో నుండి బయలుదేరుతున్న వాహన సౌకర్యం కొరకు విశ్వహిందూ పరిషత్ వారు వేణుగోపాల్ రెడ్డి నీ సంప్రదించడంతో ఎన్విఆర్ ట్రస్ట్ తరపన మీకు సహకరిస్తానని ఆనాడు తెలియజేసిన విధంగానే గురువారం రోజున హైందవ శంఖారావానికి ప్రయాణార్థం విశ్వహిందూ పరిషత్ సభ్యులు త్రిమూర్తి రెడ్డికి 2,50,000 అందించడం జరిగింది. పుంగనూరు విశ్వహిందూ పరిషత్ తరపున మరియు హిందూ జాగరణ సమితి తరపున ఎన్విఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విఆర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గురవారెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : అమరావతి లోని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలోని వారి చాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేసి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. బీసీలకు రాష్ట్రంలో నామినేటెడ్ అవకాశాలు కల్పించాలని, అదేవిధంగా రెవెన్యూ సద స్సుల సందర్భంగా గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలపై వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయా ల్సిందిగా మంత్రిని రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర- వెంకటగిరి : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన వెంకటగిరి నియోజక వర్గంలోని పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు.

మెప్మా కార్యాలయంలో

మరుగుదొడ్లు ఏర్పాటు చేయండి

మహిళా మార్ట్ లిఫ్ట్ మరమ్మత్తులు చేపట్టండి

విశాలాంధ్ర-తిరుపతి: నగరంలోని మహిళలకు అండగా ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన కేంద్రం (మెప్మా) లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ న్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో గల మెప్మా కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం, కృష్ణాపురం ఠాణా వద్ద గల మహిళా మార్ట్ ను గురువారం మధ్యాహ్నం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెప్మా కార్యాలయం వద్ద అపరిశుభ్రత, మహిళా మార్ట్ వద్ద లిఫ్ట్ మరమ్మత్తులు చేయకపోవడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మెప్మా కార్యాలయం కు పెద్ద సంఖ్యలో మహిళలు వస్తుంటారని, వారికి మౌళిక వసతులు కల్పించాలని కోరారని అన్నారు. ఈ మేరకు తనిఖీ చేశామని అన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. అలాగే చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలి సూచించామని అన్నారు. మహిళా మార్ట్ వద్ద లిఫ్ట్ మరమ్మత్తులకు గురి కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని అన్నారు. ఈ లిఫ్ట్ ను పరిశీలించాలని, త్వరగా మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. మధు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్, శ్రీనాథ్ రెడ్డి, సిఎంఎం కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

స్టీల్ వాటర్ బాటిల్ వితరణ

విశాలాంధ్ర -కార్వేటి నగరం : మండల పరిధిలోని గంగమాం బాపురం ఉన్నత పాఠ శాలలో చదువుతున్న నూట ఆరు మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులు కె వెంకటరత్నం 30 వేల రూపాయలు విలువచేసే వాటర్ బాటిల్స్ విద్యార్థులకు వితరణ చేయడంపై మండల విద్యాశాఖ అధికారులు ఎం విజయకుమార్, మనోజ్ కుమారులు అభినందించారు. ప్రతి విద్యార్థికి వాటర్ స్టీల్ బాటిల్ పై పేరు నమో చేసి ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 90 శాతం 100% ఫలితాలు రావడం పై సంతోషం వ్యక్తపరిచారు. వెంకటరత్నం సైన్స్ ఉపాధ్యాయులు వద్ద చదివిన విద్యార్థులు నేడు ఇతర దేశాల్లో సాఫ్ట్వేర్లుగా పనిచేస్తున్నా ర నీపేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాబు, ఉపాధ్యాయులు పాఠశాల చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల దేహ దారుఢ్య పరీక్షలు

విశాలాంధ్ర -చిత్తూరు: స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల దేహ దారుఢ్య సామర్థ్య పరీక్షలు చిత్తూరు జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానంలో మూడవ రోజు గురువారం కూడా పకడ్బంధీగా కొనసాగాయి. మూడవ రోజు 599 మంది అభ్యర్థులకు గాను 394 మంది హాజరయ్యారు. వీరిలో 163 మంది తదుపరి వ్రాత పరీక్ష కు అర్హతసాధించారు.శుక్రవారం ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులకే దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు. 495 మంది హాజరు కానున్నారు. వీరి పరీక్షల నిర్వహణ కొరకు అదనంగా ఒక మహిళా డి.ఎస్పీ, ఒక మహిళా ఇన్స్పెక్టర్, 5 మంది మహిళా ఎస్.ఐ.లు, 9 మంది ఏ ఎస్ ఐ లలు, 35 మంది మహిళా కానిస్టేబుళ్ళు 8 మంది మహిళా హెూం గార్డ్‌లను నియమించారు. అదేవిధంగా మహిళా అభ్యర్థులకు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వుంటే తప్పకుండా తెలపాలని ఎస్పీ సూచించారు.

స్విమ్స్ ఆధ్వర్యంలో నాగలాపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

విశాలాంధ్ర - తిరుపతి : స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో గురువారం నాగలాపురం పిహెచ్ సి పరిధిలోని నాగలాపురం-2లో గల బాలుర హాస్టల్, నాగలాపురం-3 సచివాలయంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు బిపి, షుగర్ పరీక్షలతోపాటు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరాల్లో మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించు కున్నారు.నాగలాపురం పిహెచ్ సి పరిధిలో జనవరి 3న సదాశివ శంకరపురం, కడివేడులో, జనవరి 6న వేంబాకంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సర్పంచ్ చిన్నదొరై, ఎంల్ హెచ్ పి సుశ్మిత, ఆశా గీత, స్థానిక వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంచార జాతులకు సర్టిఫికేట్ ఇవ్వాలి

విశాలాంధ్ర- వెంకటగిరి: దేశవ్యాప్తంగా సంచార జాతుల సంక్షేమ ఆర్థిక అభివృద్ధి కొరకు పలు అంశాలపై పలు సమస్యలపై జనవరి రెండో తేదీన డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ జనపథ్ న్యూఢిల్లీ నందు కేంద్ర సామాజిక న్యాయ శాఖ ఆధ్వర్యంలో మంత్రి వీరేంద్ర కుమార్ , రాష్ట్ర మంత్రులు, బోర్డు మెంబర్ భరత్ భాయ్ గారు మరియు పలువురు అధికారులు సమావేశం నందు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం సంచార కులాల వారి కోసం తీసుకుంటున్నటువంటి అనేక పథకాల గురించి మంత్రులు ,పలువురు వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్ర అఖిల భారత సంచారజాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లుకు మాట్లాడే అవకాశం కల్పించారు గత సంవత్సరం జూన్ నెల కేంద్ర సామాజిక న్యాయశాఖ వారి నుండి ఉత్తర్వులు అనుసరించి మాకు బీసీ డిఎన్టి సర్టిఫికేట్ మంజూరు చేయమని గత ఆరు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారత సంచారజాతులు అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు బిసిడి ఎన్ టి సర్టిఫికెట్ మంజూరు చేయమని కలెక్టర్లకు వినతి పత్రములు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ, మంత్రులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రిలందరికీ తమ సమస్యలు తెలియజేసి బిసి డిఎన్టి సర్టిఫికేట్ మంజూరు చేయుటకు ఆదేశాలు జారీ చేయమని వినతి పత్రములు అందజేసినాము .కానీ నేటికీ మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమున ఏ ఒక్కరికి డిఎన్టి సర్టిఫికెట్ మంజూరు కాలేదు. బీసీ జాబితాలోని కొన్ని కులాలకు మాత్రమే ప్రాధాన్యతిస్తున్నారని బీసీలోని ఎంబీసీలు మోస్ట్ బ్యాక్వర్డ్ క్యాస్ట్ అత్యంత వెనకబడిన సంచార కులాల సమన్యాయం జరగటం లేదన్నారు.

అభివృద్ధే ఆలంబనగా టిడిపి పాలన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : నాటి కాంగ్రెస్ పాలనలో జరిగినట్లుగానే గత వైసిపి ప్రభుత్వంలో కూడా తీవ్రమైన వెనుకబాటుకు గురై, నిరాశా నిస్పృహలో నలిగిపోతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకాన్ని చైతన్య పరచి అభివృద్ధే ఆలంబనగా టిడిపి పాలన సాగుతోందని బిసి విభాగం, తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలందరికీ 'కూడు - గూడు - గుడ్డ' అందించాలన్న మహెూన్నత ఆశయంతో తనకున్న రాజభోగ్యాలను సైతం విడిచిపెట్టి, తెలుగుజాతి ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాప్తి చేయించాలని నాడు యన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి, తెలుగుజాతి గౌరవంగా జీవించేలా చేశారని కొనియాడారు. టీటీడీ ఈవో, డీజీపీ, సీఎస్ లాంటి కీలక పదవుల్లో బీసీలను నియమించిన దార్శనికుడు, అటు మంత్రివర్గంలో కూడా బిసి లకు సముచిత స్థానం కల్పించి సామాజిక అసమానతలు దరి చేరకుండా రాజకీయాలు నడుపుతున్న ఆదర్శవంతమైన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. వృధాగా పోయే వేలాది టిఎంసిల గోదావరి జలాలను బనకచర్లకు తరలించి, అక్కడ నుండి రాయలసీమ ప్రాంతంలో గల అనేక చిన్న చితకా ప్రాజెక్టు లకు నీటిని నింపి కృష్ణా, పెన్నా నదీ పరీవాహక ప్రాంతాలలో కల లక్షలాది ఎకరాలకు సేద్యపు నీటిని అందుబాటులోకి తీసుకొచ్చి తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని ప్రకటించడం రాష్ట్ర ప్రగతికి చిహ్నంగా, చరిత్రను తిరగరాసే ప్రాజెక్టుగా ఏపీ సీఎం చంద్రబాబు తీర్చిదిద్దపోతున్నారని కొనియాడారు. చంద్రబాబు నాయుడు చొరవతో బీపీసీఎల్ ఆధ్వర్యంలో దశలవారీగా 95,000 కోట్ల రూపాయలతో గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు కానుండటం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, బిసి విభాగం, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి, తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు మణి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టియు

విశాలాంధ్ర - బుచ్చినాయుడుకండ్రిగ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టియు యూనియన్ ఎంతగానో దోహదపడుతు ముందు చూపుతో పని చేస్తున్న ఎస్టియు ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు అంటూ మొదటి మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్, రెండవ విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడికి రమణయ్య ఆధ్వర్యంలో ఎస్టీయూ నాయకులు క్యాలెండర్ డైరీ ఆవిష్కరించారు, ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ ఇద్దరు అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఐక్యంగా పనిచేస్తూ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారానికి మార్గం చూపుతూ మార్గదర్శకులుగా ఎస్టియు నాయకులు పనిచేయడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిమిడి దేవేంద్ర, ఎస్ టి యు,మండల అధ్యక్షుడు రోసనూరు రామచంద్రయ్య, మండల కార్యదర్శి జగన్నాథం, మండల కోశాధికారి సురేష్, ఉపాధ్యాయ బృందం ధనంజయ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

డిఎంఅండ్‌హెచ్‌ఓకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం తిరుపతిలో జిఎంపి సభ్యులు ఏపిజిఎంపిడబ్ల్యుఏ డిస్ట్రిక్ట్ సెక్రటరి డి.ఏడుకొండలు సారథ్యంలో నూతనం గా డిఎంఅండ్‌హెచ్‌ఓ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలకృష్ణ నాయక్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ గా డాక్టర్ బాలకృష్ణ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారిని జిఎం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి వారికి అభినందనలు తెలియజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఓని శాలువా, పుష్పగుచ్ఛం, పూలమాల తో సత్కరించి శ్రీకాళహస్తిస్వామివారి ప్రసాదం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం వారి సమస్యల గురించి తెలియజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ లీడర్స్ ఎం.మోహన్, ఎం.శివశంకర్, సి.రామ్మూర్తి, జి.వీరయ్య, తిరుపతి లీడర్స్ జె.కుమార్, గురుస్వామి, మునిప్రకాష్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావసభను జయప్రదం చేయండి

-కోలా ఆనంద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విజయవాడలో ఈ నెల 5వ తేదీ ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గరువారం శ్రీకాళహస్తిలో హైందవ శంఖారావం సభకు సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ప్రధాన వీధుల్లో జరిగింది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం ఏపీలో హిందూ దేవుళ్లు, వాహనాలు, రథాలు, దేవాలయాలను ధ్వంసం చేశారన్నారు. హిందూ సమాజం, ధర్మం, దేవాలయాల ఆస్తులను కాపాడు కోవాలనే ఆశయంతో విజయవాడలో హైందవ శంఖారావం సభ జరుపుతున్నామన్నారు. పార్టీలకు అతీతంగా హిందువులు ఈ సభకు రావాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, ఎస్వీ రమణ, గరికపాటి రమేష్, కూనాటి నాగరాజు, గోపాల్, పుల్లయ్య నాయుడు, ధర్మయ్య యాదవ్, మండల అధ్యక్షులు వేడం కృష్ణయ్య, ఆర్. హరీష్ రెడ్డి, బాగీర్తి వెంకటేష్, తిరుమల శెట్టి నరేష్, రాష్ట్రీయ స్వయం సేవక్ సొట్ట సుకుమార్, పి. సుబ్రమణ్యం రెడ్డి, సురేష్ బాబు, సుబ్రమణ్యం యాదవ్, బాల సుబ్రహ్మణ్యం, జీవీ అమర్నాథ్, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, కోనేటి అయ్యప్ప, కటికం చెందు, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, సజ్జలు హరీష్ రాయల్, పెద్దదాసరి శివారెడ్డి, కనపర్తి రవి తేజ రాయల్, సిద్ధూ, యతీశ్, సూర బిందు కుమార్, సింగ మాల కుమార్, నాని, గిరిధర్ సాయి, సురేష్, సుబ్రహ్మణ్యం యాదవ్, కోలా మురళి, షేక్ అబ్దుల్లా, నరేష్ పాల్గొన్నారు.

శివయ్య సేవలో రంగినేని చెంచయ్య నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను నాయకులతో కలిసి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు దర్శించుకున్నారు. ఆయన వెంట నాగమల్లి దుర్గాప్రసాద్, వినయ్, ఖాదర్, తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దాం :డివైఈవో

విశాలాంధ్ర-(శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఆర్బీవీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని పుత్తూరు డివిజను ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్బీవీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన ప్రధానోపాధ్యాయులు, పీడీలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రాజు మాట్లాడుతూ... మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వ్యక్తిగత గ్రూప్ ఉపాధ్యాయ విభాగాల కింద ప్రతి మండలం నుంచి 3 ఎగ్జిబిట్లు జిల్లా ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ముందుగా ఏర్పాటుచేసిన కమిటీలు వారి కేటాయించిన పనులను పూర్తి చేసేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన తాగునీరు, భోజనం సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సహాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కమిటీలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈవోలు భువనేశ్వరి, అంబటి బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో..

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లుపై చెవిరెడ్డి సమీక్ష

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జనవరి 10వ తేదీన నిర్వహించే వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గురువారం ప్రత్యేకంగా సమీక్షించారు. వైకుంఠ ఏకాదశి, రోజున ఉదయం 3.30 గంటల నుంచే వైకుంఠ ద్వారం ప్రారంభించ భక్తులను అనుమతించి స్వామి దర్శనంకు అవకాశం కల్పించాలన్నారు. ప్రధాన ఆలయం ముఖ ద్వారంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సువాసనలు వెదజల్లే పరిమళ భరిత పుష్పాలతో ఎంతో అందంగా అలంకరించాలన్నారు. ఇందుకోసం దేశ, విదేశాల నుంచి పువ్వులు తీసుకువచ్చేలా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. తిరుపతి నగరంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులు అందరికీ వీలైనంత త్వరగా స్వామి దర్శనం కల్పించేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. ఆలయం ముందు సర్వదర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు ఆగకుండా ముందుకు కదులుతూ వుండేలా చూడాలని, వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ గుండా అనుమతించి సామాన్య భక్తులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా గోవిందమాల ధరించిన భక్తులకు ప్రత్యేక దర్శన సదుపాయం లేనప్పటికీ స్వామి దర్శనం ఆలస్యం కాకుండా చూడాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఏలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇప్పటి వరకు ఆలయం వద్ద జరిగిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. తుమ్మలగుంట గ్రామ శివార్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినందున వాహనాలను అక్కడే పార్క్ చేసి ఆలయం వద్దకు భక్తులు రావాలని, ఈ మేరకు గ్రామస్తులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ..వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని ఆలయ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ మెంబర్స్‌కి శిక్షణ

విశాలాంధ్ర – పలమనేరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర శిక్ష మరియు పాఠశాల విద్య ఆదేశాల మేరకు పలమనేరు పట్టణంలో గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ మెంబర్స్ కు ఒకరోజు శిక్షణ మండల విద్యాశాఖ అధికారులు పీ.లీలరాణి, సి.బాలసుందరం, మరియు జిల్లా సైన్స్ అధికారి బాల చైతన్య ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. పాఠశాల యాజమాన్య కమిటీ మెంబర్స్ కు ఆర్ పి లు జి.రవీంద్రబాబు , పి .మణి మరియు డి.గురుమూర్తి పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు విధులు , బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాల యాజమాన్యం కమిటీ సమావేశాల నిర్వహణ విధివిధానాలు ,పాఠశాల అభివృద్ధి ప్రణాళిక పాఠశాల సామాజిక తనిఖీ, పాఠశాల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం మరియు సమకాలీన సమస్యలపై పరిష్కారాలు విషయాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 లీలా రాణి మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్న పేరెంట్స్ పిల్లలు కచ్చితంగా పాఠశాల విద్యను అభ్యసించాలన్నారు. ఎంఈఓ 2 బాల సుందరం మాట్లాడుతూ మీ ఊరిలో బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని బడికి వారు దూరంగా ఉండకుండా చూడాలని అది వికలాంగులైన ఏ ఇతర కారణాలవల్ల బడిలో లేకపోయినా వారి మీద శ్రద్ధ వహించి పిల్లలు పాఠశాలలో చదువు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ మెంబర్స్ ను సూచించడం జరిగింది .బాల చైతన్య సారు మాట్లాడుతూ పాఠశాల పర్యవేక్షణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం అమలు పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత, త్రాగునీరు పరిశుభ్రత , మరుగుదొడ్లు వాడడం వంటివి పాఠశాలల పరిరక్షణ మొదలైన వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ మెంబర్స్ కు సూచించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సిఆర్పిలు హరిబాబు,రెడ్డెమ్మ, గీతా , రంజిత్ మరియు అన్ని పాఠశాల చైర్ పర్సన్స్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను

సద్వినియోగం చేసుకోండి: పులివర్తి నాని

విశాలాంధ్ర – చంద్రగిరి: శుక్రవారం చంద్రగిరి మండలం నారావారిపల్లి టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించే మెగా జాబ్ మేళాలో నిరుద్యోగ యువత పాల్గొని తమ కలలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. డిక్సన్ నుండి డైకిన్ వరకు సుమారు 20 ప్రఖ్యాత కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మీ విజయ రహదారి ఇక్కడ నుండే మొదలవుతుందని మీకోసం అవకాశాలు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. మీ కలలను సాకారం చేసుకోవడానికి మీ సామర్థ్యాలను ప్రదర్శించి మీలోని ప్రతిభను వెలికి తీసి మీ కెరీర్ మొదలెట్టాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులంతా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

రంగినేని చెంచయ్య నాయుడికి

తెలుగు యువత శుభాకాంక్షలు

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని తెలుగు యువత నాయకులు తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆంగ్ల నూతన సంవత్సర శు భాకాంక్షలు పురస్కరించుకొని నాయకులు ఒళ్ళు శ్రీహరిబాబు, పట్టణ తెలుగు యువత ఉపాధ్యక్షులు వంకాయల సిద్దులయ్య, ఎర్రమ్మ రెడ్డిపల్లి నీటి సంఘం అధ్యక్షులు చంగయ్య, తెలుగు యువత నాయకుడు నవీన్, తెలుగు రైతు నాయకులు అశ్వద్ధాములు రంగినేని చెంచయ్య నాయుడుని కలిసి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు.

పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వండి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర -పిచ్చాటూరు : పిచ్చాటూరు మండలం లో పండగ పూటైనా జీతాలు ఇవ్వండి అని ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు చిన్ని రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు రాకుండా పారిశుద్ధ్యాన్ని కాపాడుతూ చెత్తాచెదారం చౌదరి మల్ల మూత్రాలను శుభ్రపరిచి సంవత్సరాల తరబడి కష్టించు పని చేస్తున్న స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పండగపూటైనా జీతాలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి గారికి అర్జీ ఇవ్వగా ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ వీలైనంతవరకు 15వ ఆర్థిక సంఘంలో నిధుల నుంచి జీతాలు ఇవ్వడానికి కార్మికులు పంచాయతీ కార్య దర్శులు సర్పంచ్లతో ఉమ్మడి సమావేశం నిర్వహించి చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు.ఆనంద్,ముని చంద్ర, పెద్ద గోవిందయ్య, లోకయ్య, లత,సరళ పంచాయతీ కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిడిపి నేత రవి తల్లి భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర – పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం రాజానగరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత రవి మాతృమూర్తి రోశమ్మ పరమపదించారు.సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం మధ్యాహ్నం రాజానగరం గ్రామానికి చేరుకుని రోశమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అనంతరం టిడిపి నేత రవి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి, ఏఎంసీ మాజీ చైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, టిడిపి నేత గిరి నాయుడు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు :అదనపు ఈవో

భక్తుల భద్రతకు పెద్ద పీట :ఎస్పీ సుబ్బరాయుడు

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్ :తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఈవో,జెఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ద్వారా దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కావున ఇందుకోసం అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. రాం బగిచా ప్రాంతంలో వాహన పార్కింగ్‌ను ఈ రోజులలో బైటకు బదిలాయించినట్లు చెప్పారు. విఐపిలు, భక్తులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి భక్తులకు ఇబ్బంది లేకుండా పారిశుద్యాని పాటించాలని, వ్యర్థాలను టీటీడీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని అదనపు ఈవో కోరారు. భక్తులకు సూచించిన నిబంధనలు పాటిస్తూ టీటీడీకి సహకరించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ తిరుమల, తిరుపతిలలో వైకుంఠ ఏకాదశికి విచ్చేసే భక్తులకు భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. తిరుమలలో ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించడం, తిరుపతిలోని ఎస్ఎస్డి కౌంటర్ల వద్ద, ఫుట్‌పాత్ మార్గంలో కూడా బందోబస్తు ఏర్పాటు చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. అంతకుముందు అదనపు ఈవో, జిల్లా ఎస్పీతో కలిసి పరకామణి భవనం ప్రక్కన ఉన్న ఖాళీ ప్రాంతం, శ్రీవారి సేవాసదన్ ముందు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనం సమీపంలో ఉన్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. తరువాత ఏటిసి వద్ద క్యూలైన్లు, ప్రవేశ మార్గాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో రామ్ కుమార్ సురేంద్ర, ఇతర అధికారులు, పోలీస్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- జాయింట్ కలెక్టరు శుభం బన్సల్

విశాలాంధ్ర-తొట్టంబేడు: భూ సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తిరుపతి జాయింట్ కలెక్టరు శుభం బన్సల్ చెప్పారు. తొట్టంబేడు మండలం పెద్దకనపర్తిలో గురువారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో శుభం బన్సల్ పాల్గొన్నారు. ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు శుభం బన్సల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దాదాపు 70శాతం భూ సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యలు పరిష్కరించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలను అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కరించలేక పోతే అందుకు గల కారణాలను ఫిర్యాదు దారునికి తెలియచేయాలన్నారు. రెవిన్యూ అధికారులు అంకిత భావంతో సదస్సులు నిర్వహించాలని శుభం బన్సల్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావు, టీడీపీ మండల అధ్యక్షులు గాలి మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏ.బి.బర్ధన్ వర్ధంతి

విశాలాంధ్ర-చిత్తూరు: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత ఏబి బర్ధన్ 8 వ వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏబి బర్ధన్ చిత్రపటానికి సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి యస్ నాగరాజు పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి జనరల్ సెక్రెటరీగా ఉంటూ సంకీర్ణ రాజకీయాల శకంలో సిపిఐ ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పార్టీని నడిపిన నాయకుడు ఏబి బర్ధన్‌ను కొనియాడారు 1940 సంవత్సరంలో పార్టీ లో చేరి విద్యార్థి సంఘంలో అధ్యక్షులుగా వ్యవహరించి, న్యాయ శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసి కార్మిక వర్గం కోసం పలు ఉద్యమాలు,పోరాటాలు చేసి 20 సార్లు అరెస్టు అయి 4 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన పోరాట యోధుడు 1957లో రాజకీయాల్లో ప్రవేశించిన ఏబీ బర్ధన్ మహారాష్ట్ర శాసనసభకు నాగపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం సీనియర్ నాయకులు హరి కిషన్ సింగ్ తో కలిసి కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుడు ఏబీ బర్ధన్ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మణి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, రమాదేవి, కుమారి, కవిత, రఘు, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు దామోదరం తదితరులు పాల్గొన్నారు.

సిపాయి లాల్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-తిరుపతి: సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం పెన్నే పల్లి గ్రామం వద్ద గల ఎంఆర్ అగర్వాల్ కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనను ఫ్యాక్టరీని గురువారం ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు - ప్రధాన కార్యదర్శి -చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగేంద్ర, శివకుమార్, సిపిఐ నియోజకవర్గ పార్టీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి స్థానిక ఏఐటీయూసీ నాయకత్వంతో కలిసి పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి. చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ. సిపిఐ కార్యదర్శి సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ ఫ్యాక్టరీలు 650 మంది వరకు పనిచేస్తున్నారని ఇందులో 600 మంది వరకు బీహార్ మధ్యప్రదేశ్ ఒరిస్సా ప్రాంతాల నుండి తీసుకువచ్చి తక్కువ వేతనాలతో ఎక్కువ సమయం పని చేయించుకుంటూ కార్మిక ఆర్థిక దోపిడీ యాజమాన్యం చేస్తుందని ఆర్య వేక్షించవలసిన అధికారులు మౌనంగా చూసి చూడకుండా ఉంటున్నారని కార్మికులకు సేఫ్టీ పరికరాలు కూడా అందివ్వడం లేదని 2008 సంవత్సరంలో ఫ్యాక్టరీని ప్రారంభించి 16 సంవత్సరాల కాలంలో మూడు యాజమాన్యాలు మారాయని అయితే కార్మికుల తలరాత మాత్రం మారడం లేదని 12 గంటలు పని చేయించుకుని 16 వేల రూపాయలు చేతిలో పెడుతున్నారని ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కానీ ఈఎస్ఐ సౌకర్యం గాని లేవని ఏ ఒక్క కార్మికుడికి కూడా గుర్తింపు కార్డు లేదని. పనిచేయిస్తున్న 650 మంది కార్మికులకు నలుగురు కాంట్రాక్టర్లు ఉన్నారని ఆ రకంగా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు తప్పించుకోవడం కోసం. కార్మిక చట్టాల నుండి తప్పించుకోవడం కోసం కాంట్రాక్టర్ల కింద కార్మికులను చేర్చి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని కనీసం గౌరవంగా కూడా చూడటం లేదని. క్యాంటీన్ నిర్వహణ చాలా లోప భూయిష్టంగా నాణ్యతలేని విధంగా ఉందని.. ఎక్కువ ధరలు కు క్యాంటీన్లో విక్రయిస్తున్నారని వీటన్నింటిపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని అలాగే కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ తక్షణమే ఫ్యాక్టరీని పరిశీలించాలని.. చనిపోయిన సిఫాయిలాల్ కుటుంబానికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని తీవ్రంగా గాయపడ్డ ఆరు కుటుంబాలకు 25 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి వైద్య ఖర్చులు మొత్తం యాజమాన్యమే భరించాలని ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభం చేసే కొరకు అక్కడ పనిచేస్తున్న కార్మికులందరికీ భోజన ఏర్పాటును యాజమాన్యం భరించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఏఐటియుసి నాయకత్వం సోమవారం కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం సమర్పిస్తుందని కార్మికులందరినీ ఐక్యపరిచి హక్కుల సాధన కోసం కృషి చేస్తుందని ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చాము వీరివైపున ఎవరూ లేరు అడిగే దిక్కు లేదని యాజమాన్యం వ్యవహరిస్తే కార్మిక సంఘంగా ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదని వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగేంద్ర సిహెచ్ శివకుమార్. స్థానిక నాయకులు టి రమణయ్య బాలు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెవెన్యూ సదస్సులకు 329 అర్జీలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లాలోని గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి గురువారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు జిల్లావ్యాప్తంగా గురువారం 49 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజలకు భూ సమస్యలు పరిష్కరించుకోనుటకు అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రెవిన్యూ సదస్సులలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబందిత అధికారులు పాల్గొని విజయవంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 15193 అర్జీలు అందాయని అందులో నేడు 329 అర్జీలు వచ్చాయని అందులో అసైన్మెంట్ ఆఫ్ హౌస్ సైట్స్ పై -19, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ పై -8, క్యాస్ట్ వెరిఫికేషన్ -2,మీ సేవ ద్వారా రెవెన్యూ పై -5, రీ సర్వే పై -29, ల్యాండ్ గ్రాబింగ్ పై -1, ఫాం 22ఎ పై -0, ఆర్ ఓ ఆర్ పై -158, ఇతర విషయాలకు సంబంధించి 99 వచ్చాయని తెలిపారు. ఈరోజు వచ్చిన అర్జీలలో 155 అర్జీల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని మిగిలిన అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు. సెంట్లు చొప్పున స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు సిపిఐ కార్యాలయం నందు ఎండి రవి అధ్యక్షతన నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి హాజరయ్యారు. ఎన్నికలలో గెలవడానికి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అని విపరీతమైన ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఆ సూపర్ సిక్స్ ఏమయింది అని ప్రశ్నించారు. నిరుద్యోగులందరికీ మా ప్రభుత్వం రాగానే ఉద్యోగాల వర్షం కురిపిస్తానన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్మిక వర్గానికి మద్దతు తెలియజేసి జీతాల పెంపుదలకు మా ప్రభుత్వం ఎప్పుడు ముందు వరసలో ఉంటుందని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రధానంగా పేద ప్రజలు తమ కుటుంబంతో సంతోషంగా ఉండాలంటే ఒక్క సెంటు లో ఇల్లు కట్టుకొని ఉండడం సాధ్యం కాదని మా ప్రభుత్వం రాగానే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు స్థలం కేటాయిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. జనవరి 2వ తారీకు నుండి 9వ తారీకు వరకు జిల్లాలోని ఇల్లు లేని నిరుపేదల దగ్గర నుండి అర్జీలు సేకరించి ఆర్డీవో కార్యాలయం నందు 9వ తారీఖున పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర్ కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ నగర కార్యవర్గ సభ్యులు కే.రాధాకృష్ణ కేవైరాజా, శివ కే రామకృష్ణ ఉదయ్ కుమార్ పద్మనాభం రెడ్డి చలపతి ఎన్ శ్రీరాములు మంజులమ్మ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.